

# మినీకథావీధి

ఢిల్లీలో ''మదర్ డయరీ'' చాలచోట్ల ప్రాముఖ్యత సంపాయించింది. టోకెన్ కొని స్లిట్‌లో వేస్తే పాలు వస్తాయి మెషిన్‌లోంచి.

## "కాలూ"



### రమాశ్రీరామ్

"కాలూ" (నల్లవాడు) రోజూ ఆ వింతను చూస్తూనే వున్నాడు. తనూ అలాగే టోకెన్ కొని, పాలు తీసుకోవాలని అతడికెంతో ఆశ.

కాలూ వయస్సు ఆరు, ఏడు మధ్య వుంటుంది. రోజూ ప్రొద్దున, సాయంత్రం అందరూవచ్చి, టోకెన్ వేసి, పాలు తీసుకెళ్ళడం చూస్తూనే వున్నాడు. తనూ అలా పాలు ఎందుకు తీసుకోకూడదని కాలూకి ఓ రోజు అన్పించింది. అయితే ఎంత డబ్బు కావాలో, ఎలా తేవాలో అతడికి తెలియదు.

కౌంటర్‌లో సీతారామ్ కూర్చుని వున్నాడు. అతడి దగ్గరికెళ్ళి "పాలు కావాలి" అని అడిగాడు. "డబ్బు ఇవ్వు" అన్నాడు సీతారామ్. "నా దగ్గర లేవు" అన్నాడు అమాయకంగా. "మీ అమ్మ నడిగి తీసుకురా" అన్నాడు గట్టిగా సీతారామ్. బిక్క మొహం వేశాడు కాలూ.

కొంచెంసేపు అటూ, ఇటూ చూశాడు. ఇంటికెళితే అమ్మ వుండదు. రామ్‌కలి అందరిళ్ళలో పాచి పని చేస్తుంది. ఆరుగురు సంతానం. కాలూ నాలుగోవాడు. అందరిళ్ళలో దొరికిన రొట్టెలు, అన్నం ఇంటికి తీసుకొస్తే అందరూ దానిమీదపడి తింటారు. రామ్‌కలి మొగుడు తాగి తాగి చచ్చిపోయాడు. ఆరుగురు పిల్లల్ని పెళ్ళాన్ని వదిలేసి. బతికుంటే మరి నల్గురుండేవారేమో.

కాలూ అన్నలిద్దరు మెకానిక్ షాపుల్లో పని చేస్తుంటారు. కాలూది ఎటూగాని వయస్సు. అందుకే రోడ్లు తిరుగుతూ, ఆడుతూ, తన మూడో అన్నతో, ఇద్దరు చెల్లెళ్ళతో గిల్లిగజ్జాలాడుతూ, అమ్మ వచ్చేదాకా కాలక్షేపం చేస్తుంటాడు.

వాడి దినచర్యలో సగంభాగం ఆ 'మిల్క్‌బూత్' దగ్గరే గడుపుతుంటాడు. వాడి దృష్టి ఎప్పుడూ ఆ టోకన్లమీద, ధారగా పడే ఆ పాలమీదే వుండేది.

రోజూ వస్తున్న కాలూని గమనిస్తూనే వున్న సీతారామ్ ఓ రోజు వాడ్ని దగ్గరకు పిల్చి, ఇలా అన్నాడు. "నీ పేరేమిట్రా."

"కాలూ" అన్నాడు వాడు.

"పాలు కావాలా నీకు?" అడిగాడు సీతారామ్ వాడ్ని ముద్దు చేస్తున్నట్టుగా.

వెంటనే "అవును" అని గట్టిగా తలూపేడు కాలూ.

"మీ అమ్మనడిగి ఒక్క రూపాయి, ఒక్క పదిపైసలు తీసుకుని ఓ గిన్నె కూడా తీసుకునిరా. పాలు దొరుకుతాయి" అని అంతా వివరించి చెప్పాడు.

కాలూ ఎంతో బుద్ధిమంతుడిలాగ తలూపి అక్కడ్నుంచి ఒక్క దౌడు తీశాడు.

అమ్మ ఎప్పుడు వస్తుందా అని గుడిసె బయటే కావలి కాశాడు.

అమ్మ వచ్చింది. రాగానే జరిగిందంతా చెప్పి, పైసలివ్వమని ప్రాణం తీయడం మొదలెట్టాడు. రామ్‌కలికి విసుగ్గా వుంది. చూసిచూసి రెండంటించింది.

ఏడుస్తూ కూచున్నాడు కాలూ.

ఆరయ్యేటప్పటికి అన్నలిద్దరూవచ్చారు

అన్నలనెలా 'కాకా' పట్టాలో కాలూకి బాగా తెల్సు.

"నీ గుడ్డలు నేను వుతుకుతాను. నాకు పైసలివ్వవా" అని అడిగాడు పెద్దన్నని. వాడు ఆ మాట విన్నదే తడవుగా ఒప్పుకున్నాడు. ఓ అర్ధరూపాయి తీసి, కాలూ మొహాన పారేశాడు. 'మిగిలిన డబ్బులు చిన్నన్నని అడుగుదాం' అని వాడి దగ్గరికెళ్ళాడు.

"ఈరోజు నీకు బాగా ఆకలేస్తోందికదా! ఇందా నా రొట్టెకూడాతీస్కో. తీస్కోలే- ఇందా! ఫర్వాలేదు.... మరి నాకు యాభై పైసలివ్వవా?" అసలు సంగతి బైట పెట్టాడు. చిన్నన్న వెంటనే వాడిరొట్టె వాడిమీద పడేశాడు. "నేనివ్వను" అని ఖచ్చితంగా చెప్పేశాడు. "తీస్కో.... పోనీ. నలభై పైసలివ్వు." సరిపెట్టుకుందాం అనుకున్నాడు. చివరికి, బేరం ముఫ్పై పైసల కొచ్చింది. చిన్నన్న ముఫ్పై పైసలిచ్చి, కాలూ రొట్టె తీసుకున్నాడు.

"అబ్బ! ఎనభై పైసలయింది. ఇంకా ముఫ్పై పైసలు కావాలి?" ఏది తెల్సినా, తెలియకపోయినా, ఆ వయస్సులోనే డబ్బులుగురించి మాత్రం బాగా తెల్సు కాలూకు.

తెల్లవారింది. "ఈ రోజు ఎలాగైనా సరే పాలు కొని, తాగాలి" అని గట్టిగా నిర్ణయించుకున్నాడు మనస్సులోనే కాలూ.

రామ్‌కలి పెద్ద పిల్లలిద్దరికి ఎండు రొట్టెలు రెండేసి ఇచ్చి పనికి పంపించింది. తనూ పనికి బయల్దేరబోయింది.

కాలూ వెళ్ళనివ్వలేదు. "పావలా కావాలి" అని మారాం చేయడం మొదలెట్టాడు. అది మామూలు- రెండు చెంప దెబ్బలు. కాలూ లక్ష్యం చేయలేదు. ఆమె కాళ్ళు పట్టుకుని లాగుతున్నాడు వెళ్ళనీయకుండా. మట్టిలో పడి పొర్లుతున్నాడు.

వాడినెలా సముదాయించాలో, ఎలా వదిలించుకోవాలో రామ్‌కలికి అర్ధం కాలేదు. ఈమధ్య వాడికి పట్టిన ఆ పాలపిచ్చి వదిలించలేకుండా వుంది. అవతల పనికి లేటైపోతోంది. బొడ్లోనుంచి పదిపైసలు బిళ్ళ తీసి వాడి మొహాన విసిరింది.

కాలూ అమ్మ కాళ్ళు వదిలేసి, ఆ పది

# మల్లెపందిరి

## రాత్రి సిగ్గుపడింది

యుధిష్ఠిరుడి రాజసూయానికి తరలి వెడుతూ వున్న శ్రీకృష్ణుడి బంధు పరివారం దారిలో ఆ రాత్రి విడిది చేశారు. శిశుపాలుణ్ణి చంపడానికి వెడుతున్న సేనాశిబిరం కాదది. ఎంతోమంది నవదంపతులతో వెడుతూవున్న వినోద యాత్రిక బృందం అది. కనక, పాన గోష్ఠితో కేళీ విలాసాలతో గడిపారు ఆ బృందంలో వారందరూ.

ఇతి మదమదనాభ్యాం రాగిణః స్పష్టరాగాన్
అనవరత రతశ్రీ సంగిన స్తా నవేక్ష్య
అభజత పరివృత్తిం సాథ పర్య స్తహస్తా
రజని రవనతేందు ర్లజ్జ యాధోముఖేవ॥

(మాఘుడు)

ఇలా మైకంతోనూ, మదన భావంతోనూ స్పష్టంగా కనపడుతూవున్న ఎర్రదనంవల్ల వారి అనురాగ పూర్ణత్వాన్ని గమనించి, నిరంతర రతి శోభతోవున్న వారిని చూసి, రాత్రి దేవి చేయి చాటు చేసుకుని (హస్త నక్షత్రం గడచిపోగా) చంద్రుడు వాలిపోగా సిగ్గుతో ముఖం వంచుకున్న దానిలా ప్రవర్తించింది. ప్రక్కకు తొలగిందన్నమాట.

వాలిన చంద్రుడు=సిగ్గుతో దించుకున్న ముఖం.

—సౌభరి

పైసల దగ్గరికి వెళ్ళాడు. ఇంతలో మూడో అన్న అక్కడ ప్రత్యక్షం. పది పైసలు తీసేసుకున్నాడు. కాలూ గట్టిగా ఏడ్వడం మొదలెట్టాడు.

రామ్‌కలి వెనక్కి తిరిగొచ్చి, అతి కష్టంమీద మూడోవాడి దగ్గర్నుంచి, పది పైసల బిళ్ళ లాక్కుని కాలూకిచ్చి వెళ్ళిపోయింది.

"ఇంకా ఇరవై పైసలు."

టక్కుమని కాలూకి తనెప్పుడో, 'తాత' యిచ్చిన పదిపైసలు డబ్బాలోవేసి, దాచుకున్నట్టు జ్ఞాపకమొచ్చింది. వెళ్ళి డబ్బా తీసి చూశాడు. లేదు. ఎక్కడా దొరకలేదు. ఇల్లంతా పిచ్చిపట్టినట్టు గందరగోళం చేశాడు. అన్నీ గుడ్డలు తీసి పారేస్తుంటే, రామ్‌కలి చింపిచీర కొంగు చివర కట్టిన మూటలో వాడికి ఏదో గట్టిగా తగిలింది.

గబగబా మూట విప్పాడు. పది పైసల బిళ్ళ. కాలూ ఆనందం పట్టలేకపోయాడు. ఆ సంతోషంలో వాడు తనకు కావలసిన డబ్బంతా పోగయిందనుకున్నాడు. తను అనుకున్న డబ్బు— కావలసినంత డబ్బు. లాటరీలో ఫస్టు ప్రైజు వచ్చినంత సంబరం. ప్రపంచం అంతా తన చేతిలోనే వున్నంత ఉత్సాహం.

ఇంట్లో వుండే గిన్నెలన్నిటిలోకి పెద్ద గిన్నె తీసుకుని పరుగెత్తి 'బూత్' చేరుకున్నాడు.

ఇక బూత్ మూయబోయే సమయం. జన సంచారంకూడా యెక్కువగాలేదు.

తన చేతిలోవున్న అర్ధరూపాయబిళ్ళ, పావలా, ఐదుపైసలు, రెండు పదిపైసలు అంతాతీసి, సీతారామ్ కిచ్చాడు.

సీతారామ్ పెదవి విరిచాడు.

"మళ్ళీ ఏమైందో అర్థం కాలేదు" కాలూకి.

"ఇంకా పదిపైసలు కావాలి" అన్నాడు సాగదీస్తూ సీతారామ్.

ఇంకా ఓ పదిపైసలు ఎక్కడ పుడుతుందో కాలూకి అర్థం కాలేదు, బిక్క మొహం వేశాడు. తను పడ్డ శ్రమ అంతా వృథాయేనా? ఇంకా పది పైసలు- ఇంకో పది పైసలు— ఊహూ—తనకు ఇంకెక్కడా దొరకదు. ఎవ్వరూ ఇవ్వరు. ఏడుపొస్తోంది కాలూకి.

సీతారామ్‌వైపు జాలిగా చూడసాగాడు. ఏమనుకున్నాడో ఏమో సీతారామ్ "పరేలే గిన్నె తెచ్చుకున్నావా?" అడిగాడు. అడుగుతూనే వాడి ఆ పెద్ద గిన్నెను చూసి సీతారామ్ నవ్వుతున్నాడు.

అతడు నవ్వుతుంటే, ఎందుకో తెలియకపోయినా, కాలూకూడా నవ్వాడు.

"నీ పదిపైసలు నేనిస్తున్నాను గాని, ఈ టోకెన్ తీసుకుని వెళ్ళ ...." అతడి మాట యింకా పూర్తి కానివ్వలేదు కాలూ- "నాకు తెలుసు, నాకు బాగా తెలుసు" అని అతడి చేతిలోని టోకెన్ లాక్కుని, తన గిన్నెను జాగ్రత్తగా పాలువచ్చే రంధ్రం క్రింద సర్ది సర్ది పెట్టి, మెల్లగా టోకెన్ స్లిట్‌లో వేశాడు.

అబ్బ! యెలాగైతేనేం అతడి కల పండింది.

